విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- తహసీల్దార్లు, ఎంపీడీవోలు ప్రజావాణికి రావాల్సిందే
- అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరిక

కలెక్టరేట్, జనవరి 6: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు ప్రజావాణికి రావాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా, 254 మంది నుంచి అర్జీలు వచ్చాయి. ప్రధానంగా పంట రుణమాఫీ, భూసమస్యలు, పింఛన్లు, పీఎం కిసాన్ సమ్మాన్ యోజనతో పాటు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఏకరువు పెడుతూ, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రజావాణి ముగిసిన అనంతరం కలెక్టర్ పలు దశల్లో ఉన్న అభివృద్ధి పనులు, ధరణి, భూసేకరణకు సంబంధించిన దరఖాస్తులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలన్నారు. తమ పరిధిలోని భూసేకరణ కేసులు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీవోలు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేయాలని మండల ప్రత్యేకాధికారులు, ఎంఈవోలకు సూచించారు. ఏవైనా ఇబ్బందులుంటే పరిష్కరించాలన్నారు. త్వరలో మండల ప్రత్యేకాధికారులు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు ఈనెల 30లోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏడేండ్లకే నూరేండ్లు నిండాయి..

15 రోజులుగా మృత్యువుతో పోరాడి ఓడిన బాలుడు

రత్నాకర్ రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్ రూరల్, జనవరి 6: చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తోకలపల్లి గ్రామానికి చెందిన దొండపాటి రాజిరెడ్డి-రాణి దంపతుల చిన్న కుమారుడు రత్నాకర్ రెడ్డి (7) రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రత్నాకర్‌రెడ్డి గత నెల 20న తోకలపల్లి గ్రామంలో కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు కాగా, హుజూరాబాద్ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హనుమకొండకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ రత్నాకర్ రెడ్డి మృతి చెందాడు. 15 రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న బాలుడు కన్నుమూయడంతో చెల్పూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల గేటు నిర్మాణ పనులు

శంకరపట్నం, జనవరి 6: ఎరడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు గేటు ఏర్పాటు చేసేందుకు సోమవారం నిర్మాణ పనులను ప్రారంభించారు. పాఠశాలకు గేటు లేకపోవడంతో ఇటీవల పలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీంతో ఆ పాఠశాలలో చదివిన పలువురు పూర్వ విద్యార్థులు ఏకమయ్యారు. దాదాపు రూ.30 వేలు పోగు చేశారు. ఈ మేరకు సోమవారం గేటు నిర్మాణ పనులు ప్రారంభించగా, వీరిని ఉపాధ్యాయులతో పాటు పలువురు గ్రామస్తులు అభినందించారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్/తెలంగాణ చౌక్, జనవరి 6: రాష్ట్రంలో అన్ని కులాల తరహాలోనే కురుమ కులానికి కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు కడారి అయిలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ కురుమ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, కొమురయ్య, విజయ్‌కుమార్, వీరయ్య, రాజమల్లయ్య ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మానకొండూర్, జనవరి 6: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ భారతి సూచించారు. కాన్సియస్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని చాణక్య ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలను తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆడెపు రవీందర్, ఎక్సైజ్ కానిస్టేబుల్స్ సురేశ్, కొండల్‌రెడ్డి, మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

చొప్పదండి, జనవరి6: పట్టణంలో తక్షణ సహాయం కింద మంజూరైన నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపనలు చేశారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద మంజూరైన 4 లక్షల రూపాయల విలువైన డ్రైక్లీనింగ్ దుకాణాన్ని మహిళలతో కలిసి ప్రారంభించారు. 22 మంది లబ్ధిదారులకు 22లక్షల 2వేల 552 రూపాయల విలువైన కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

జీవీఆర్ పరామర్శ

మానకొండూర్, జనవరి 6: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోల్సాని గణేశ్ రావు తల్లి యశోద మృతిచెందగా, సోమవారం సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

చొప్పదండి, జనవరి 6: పట్టణానికి చెందిన తాళ్లపెల్లి కనకయ్య ఇటీవల మరణించగా సోమవారం ఆయన కుమారుడు శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, కొత్త గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఖలీద్‌కు కలెక్టర్ అభినందన

కమాన్‌చౌరస్తా, జనవరి 6: కవి ఖలీద్‌ను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఖలీద్ కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, తాను రాసిన 'మనమంతా ఒక్కటే' పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆటోడ్రైవర్ అయిన ఖలీద్ కవిగా మారి పుస్తకం రాయడంపై సంతోషం వ్యక్తం చేసి, అభినందించారు.

మానేరు విద్యార్థి ప్రతిభ

కొత్తపల్లి, జనవరి 6: కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థి ఎల్ త్రిశాంత్ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ 2024 ఉషూ చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు విద్యాసంస్థల పీ ఈ టీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డితోపాటు డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, జహీదా, తిరుపతి, స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

వోపా నూతన కార్యాలయం ప్రారంభం

తెలంగాణచౌక్, జనవరి 6: కరీంనగర్ జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెసనల్స్ అసోసియేషన్(వోపా) ఆధ్వర్యంలో కమాన్ రోడ్‌లో నిర్మించిన నూతన కార్యాలయాన్ని నగర మేయర్ సునీల్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయాన్ని నిర్మించిన వోపా సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి శంకరయ్య, కోశాధికారి అంజయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, లక్ష్మణాచారి, మధుసూదనాచారి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

తెలంగాణచౌక్, జనవరి 6: పౌరసరఫరాల గోదాంలో పని చేస్తున్న కార్మికులు పెంచిన కూలిరేట్ల జీవోను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా పలు గోదాంలో పని చేస్తున్న కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పాల్గొని కార్మికులకు మద్దతు ప్రకటించారు. అనంతరం కార్మిక నాయకులు ప్రజావాణిలో జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న, ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య. నాయకులు రాజయ్య, సంతోష్, సాంబమూర్తి, మల్లయ్య పాల్గొన్నారు.

గోల్డెన్ శాతవాహన సేవలకు గుర్తింపు

విద్యానగర్, జనవరి 6: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ రీజియన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న క్లబ్‌లలో గోల్డెన్ శాతవాహన క్లబ్‌కు గ్లోబల్ కాజెస్‌లలో అవార్డులు వచ్చాయి. హంగర్ రిలీఫ్, విజన్, ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్, డయాబెటిస్, యూత్ ఎంపవర్మెంట్, హుమెనిటేరియన్ విభాగంలో ఆరు అవార్డులు, బ్యాసర్ ప్రజెంటేషన్‌లో రెండో స్థానం రావడం ఎంతో సంతోషకరమని క్లబ్ అధ్యక్షుడు మానువాడ శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ననువాల గిరిధర్ రావు, ట్రెజరర్ కుంభోజు రమేశ్, ఎల్‌సీఎఫ్ కో-ఆర్డినేటర్ అక్కినపల్లి అజయ్ కుమార్, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ చిలుపూరి రాములు, థర్డ్ వైస్ ప్రెసిడెంట్ మమత వేణు, డైరెక్టర్లు మానువాడ వనజ, అక్కనపల్లి లక్ష్మి, కుంభోజు సమత, చిలుపూరి జ్యోతి, ననువాల హరిప్రియ, బిరుదుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రూ.15 వేలు అందించాల్సిందే..

- కాంగ్రెస్ ఎన్నికల హామీ అమలు చేసే దాకా పోరాటాలు
- రైతు భరోసా రూ.12 వేలు ప్రకటనపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన కార్యక్రమాలు

తెలంగాణచౌక్/సైదాపూర్/చిగురుమామిడి, జనవరి 6: ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి సాయం అందించాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుభరోసా కింద రైతులకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని తెలంగాణ చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, మేయర్ సునీల్‌రావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం అందించే వరకూ బీఆర్ఎస్ పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

- సైదాపూర్ మండలకేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్, వ్యవసాయాధికారి కార్యాలయాల్లో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ చాడ ప్రకాశ్‌రెడ్డి, నాయకులు ఎల్కపల్లి రవీందర్, పైడిపల్లి రవీందర్, వర్నె మోహన్‌రావు, తొంట రజినీకాంత్, ఏశిక ఐలయ్య, మాదం స్వామియాదవ్, మునిపాల శ్రీనివాస్, పొడిశెట్టి కొమురయ్య, వెన్నమల్ల రమేశ్, దుంపేటి రమణాచారి, సురేశ్, ఐలయ్య, రమేశ్, శ్రీనివాస్, మహేశ్ తదితరులు ఉన్నారు.
- చిగురుమామిడి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, ఆర్బీఎస్ మాజీ మండలాధ్యక్షుడు పెనుకుల తిరుపతి, మండల నాయకులు ఆకవరం శివప్రసాద్, ఎండీ సర్వర్ పాషా, కృష్ణమాచారి, గీట్ల తిరుపతిరెడ్డి, శరభంద రెడ్డి, సత్యనారాయణ, మల్లేశం, మహంకాళి కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరి మృతి

రాంనగర్, జనవరి 6: నగరంలోని జ్యోతినగర్‌లో బిల్డింగ్ నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి తాపీ మేస్త్రీ కిందపడి మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. కరీంనగర్ రూరల్ పరిధిలోని దుర్శేడ్ గ్రామానికి చెందిన నేతి తిరుపతి (47) తాపీమేస్త్రిగా పనిచేస్తూ జీవిస్తున్నారు. సోమవారం జ్యోతినగర్‌లో భవన నిర్మాణ పనుల కోసం రెండో అంతస్తులో తడకలు కడుతుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య నేతి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గంగాధర, జనవరి 6: మధురానగర్‌లోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ ప్రియదర్శిని సోమవారం తనిఖీలు నిర్వహించారు. గోడౌన్‌లో ఎరువులు, దుకాణంలో రికార్డులను పరిశీలించారు. ఎరువులు తీసుకువెళ్లే రైతులకు విధిగా రసీదు ఇవ్వాలని సూచించారు. దుకాణాల ఎదుట ఎరువుల ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. నకిలీ ఎరువులు, మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ ఏవో శ్రీనివాస్, ఏఈవోలు ఉన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

ఇల్లందకుంట, జనవరి 6: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాలను రెవెన్యూ అధికారులు ప్రదర్శించారు. మండలంలో మొత్తం 26,447 మంది ఓటర్లలో 12,915 మంది పురుషులు, 13,531 మంది మహిళలు ఉన్నారని తహసీల్దార్ రాణి తెలిపారు. మొత్తం వార్డులు 169 ఉన్నాయని వెల్లడించారు.

పురుమల్ల శ్రీనివాస్‌కు కాంగ్రెస్ ఝలక్

కరీంనగర్ రాంనగర్, జనవరి 6 : కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌కు నోటీసులు ఇవ్వడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ డిసిప్లినరీ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి సోమవారం వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడు, బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడితో పాటు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తిపై శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి కార్యకర్తల నుంచి క్రమశిక్షణా చర్యల కమిటీకి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. గతేడాది డిసెంబర్ 18న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం, కరీంనగర్ డీసీసీ కార్యాలయ ఆవరణలో డీసీసీ అధ్యక్షుడికి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే మీటింగ్ నిర్వహించి పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, డీసీసీ అధ్యక్షుడిపై ఘాటు వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. షోకాజ్ నోటీసులు అందిన వారం రోజుల్లోపు శ్రీనివాస్ స్పందించకపోతే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశానుసారం చర్యలు తీసుకోనున్నట్లు నోటీసులో వివరించారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

తెలంగాణ చౌక్/హుజూరాబాద్ టౌన్/వీణవంక/గన్నేరువరం, జనవరి 6: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మాల మహానాడు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం జిల్లాలో పలువురు మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్లకు తరలించి, సాయంత్రం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయా చోట్ల అరెస్టైన వారిలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొల్లు బాబు, రాష్ట్ర నాయకులు పసుల స్వామి, జిల్లా నాయకులు మద్దెల రాజేందర్, తొగరు స్వామి, నాయకులు తొగరు సంపత్, నీరటి రమేశ్, తెలంగాణ మాలహక్కుల పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తప్పెట రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల సురేశ్, వీణవంక మండలాధ్యక్షుడు కర్నె నరసయ్య, సీనియర్ నాయకుడు వోరెం శ్రీనివాస్, మాల మహానాడు గన్నేరువరం మండలాధ్యక్షుడు అనుమాండ్ల మల్లేశం ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో అన్నదానం

విద్యానగర్, జనవరి 6: బాలాజీ అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన దవాఖానలో రోగుల బంధువులకు నిత్యాన్న భోజన పంపిణీ కార్యక్రమం రెండో వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరై మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి, ఇక్కడ చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా అల్పాహారం, భోజనం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులతో పాటు ఉంటున్న వారికి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో స్పందన వృద్ధాశ్రమానికి 3 బెడ్లు, పేద మహిళలకు 5 కుట్లు మిషన్లు, ఐతుపల్లిలోని పాఠశాలకు సౌండ్ బాక్స్ వితరణ చేశారు. ప్రభుత్వ బధిరుల పాఠశాలకు రెండు సీసీ కెమెరాలు, గ్రైండర్, సౌండ్ సిస్టం అందజేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ కరీంనగర్ ఆర్ఎంవో డాక్టర్ నవీన, బాలాజీ సేవా సమితి ఫౌండర్ రాచమల్ల ప్రసాద్, కోశాధికారి తొడుపునూరి వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ పల్లెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మకరంపుర, జనవరి 6: నగరంలోని పలు ఫీడర్లలో 11కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, గోదాం ఏరియా, భగత్‌నగర్, ధోబీఘాట్ ఏరియా, జానకీ స్ట్రీట్

* మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు కశ్మీర్‌గడ్డ, ముకరంపుర, టూటౌన్ ఏరియా, ఫైర్ స్టేషన్ ప్రాంతం, శ్రీనగర్ కాలనీ రోడ్ నంబర్-1, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇసుక మాఫియా బరితెగింపు

- జమ్మికుంట పట్టణంలో నుంచే జోరుగా అక్రమ రవాణా
- ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్‌పై నుంచే రయ్‌రయ్
- బెంబేలెత్తిపోయిన వాకర్లు, వాహనదారుల నిలదీత
- అయినా తీరు మార్చుకోని అక్రమార్కులు..

వాకర్స్ ట్రాక్‌పై ఇసుక వాహనాలు

జమ్మికుంట, జనవరి 6: ఇసుక మాఫియా బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నది. ఇసుక అక్రమంగా తరలించే క్రమంలో అడ్డువచ్చే వ్యక్తులపైకి వాహనాలను ఎక్కించేందుకు సైతం వెనుకాడడం లేదని తెలిసింది. గతంలో ప్రమాదాలెన్నో జరిగాయి. కొన్ని కావాలన్నట్లుగానే చేశారనే ఆరోపణలున్నాయి. తాజాగా మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసుకున్న ట్రాక్‌పై నుంచే ఇసుక వాహనాలు రయ్.. రయ్ మంటూ చక్కర్లు కొడుతుండగా, వాకర్స్ బెంబేలెత్తిపోతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పలువురు వాకర్లు వాహనదారులను నిలదీశారు. ఇంత స్పీడ్‌గా వెళ్లడమేంటి..?మీదకు వచ్చేలా తోలుతున్నారు..? ఇదేం పద్ధతి..? అధికారులకు చెబుతామని హెచ్చరించారు. కానీ, అక్రమార్కులు ఏదీ పట్టించుకోలేదు సరికదా, ఎవరికి చెబుతారో చెప్పుకొండంటూ.. అదే స్పీడ్‌లో వాహనాలను తీసుకెళ్లడం వాకర్స్‌ను ఇబ్బందులకు గురిచేసింది.

మొన్న కోరపల్లి.. నిన్న మడిపల్లి.. నేడు జమ్మికుంటలో

ఇసుక అక్రమ రవాణాదారుల డ్రైవింగ్ అంటేనే ప్రజలంతా జంకుతున్నారు. గతంలో విలాసాగర్ నుంచి వచ్చే వాహనాలను కోరపల్లి గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. గొడవలు జరిగాయి. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు వెనక్కి తగ్గారు. ఇటీవల తనుగుల, గండ్రపల్లి నుంచి వచ్చే వాహనాలను ధర్మారం, కొత్తపల్లి ప్రజలు అడ్డుకున్నారు. మడిపల్లి గ్రామ ప్రజలైతే 20ట్రాక్టర్లను పట్టుకుని ఆందోళనకు దిగారు. అక్రమార్కులు ప్రజల మీదకు వాహనాలను ఎక్కించేందుకు యత్నించారు. అయితే, గ్రామస్తులంతా ఏకం కావడంతో ఇసుకాసురులు వాహనాలతో పారిపోయారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఓ స్కూల్ సమీపంలో రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా కల్వర్టు కడుతున్నారు. ఇసుకాసురుల వాహనాలు అటు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో వాహనాలన్నీ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ప్రధాన రోడ్డు మీదకు వస్తున్నారు. అందులో భాగంగా ఉదయం పూట వాకింగ్ ట్రాక్ నుంచి వాహనాలను ఇష్టానుసారంగా నడుపుతుండగా, వాకర్లు భయపడిపోతున్నారు. ఈ క్రమంలో వాకర్లు వాకింగ్ చేయడం లేదని తెలిసింది. అక్రమంగా ట్రాక్‌పైకి వచ్చి వాకర్లను ఇబ్బందులకు గురిచేస్తున్న మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అడ్డూ అదుపులేని అక్రమ రవాణా

మానేరు పరీవాహక ప్రాంతాలైన విలాసాగర్, తనుగుల, గండ్రపల్లి గ్రామాల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నది. ఇదంతా అధికారులకు తెలిసే సాగుతున్నదన్న విమర్శలున్నాయి. అప్పుడప్పుడూ రవాణా అడ్డుకున్నట్లు అధికారులు వ్యవహరిస్తున్న శైలిపై అనేక ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారి జోక్యంతో ఇటీవల 70మందికి పైగా ఇసుక అక్రమ రవాణాదారులపై ఏకకాలంలో కేసులు పెట్టారు. వారంలో రెండు సార్లు స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెడుతున్నారు. అయినా.. దందా మాత్రం ఆగడం లేదు. తెల్లవారుజాము నుంచి ఉదయం 10గంటల్లోపు అంతా జరిగిపోతున్నది. ఇక వాహనాల డ్రైవర్లకు లైసెన్సులు.. ట్రాక్టర్లకు నంబర్లు.. పత్రాలు కూడా ఉండవని సమాచారం. ముఖ్యంగా వాహనాలను డ్రైవింగ్ చేస్తున్నదంతా మైనర్లే కావడం, ఇదంతా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దుకాణాల కేటాయింపునకు ముగిసిన డ్రా

కార్పొరేషన్, జనవరి 6: నగరంలోని ప్రభుత్వ హాస్పిటల్ వెనుకాల ఉన్న వీధి వ్యాపారుల దుకాణాల